క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మాగనూర్: మండలంలోని పెగడబండ శ్రీనివాసులు అనే వ్యక్తి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా నమ్మదగిన వారు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో వెళ్లి తనిఖీ చేయగా ఇసుక లోడ్‌తో వెళ్తుండగా అటుగా వచ్చిన డయాల్-100పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ శ్రీనివాసులు, ట్రాక్టర్ యాజమాని వెంకటేష్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎవరైనా మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలించిన, డంపుచేసిన అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంబాదాస్‌రావుకు అభినందన



మక్తల్: లయన్స్‌క్లబ్ సేవచేయడంలో ముందంజలో ఉందని జిల్లా గవర్నర్ హరినారాయణ భట్టడ్ అన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ రికార్డులను పరిశీలించి ఆయనను అభినందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబదాస్‌రావు ఆధ్వర్యంలో ఈ ఏడాదిలో ఉచితంగా 3వేల మందికి వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు సేవ కార్యక్రమాలు అందించడంపై అంబాదాస్‌రావును అభినందించారు. అనంతరం గవర్నర్ హరినారాణభట్‌ను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆత్మరాంహెడ్కే, మఠం వాదిరాజ్, పృధ్వీరాజ్, డీవీచారి, జైపాల్‌రెడ్డి, సత్యఆంజనేయులు, కట్టవెంకటేష్, నరేందర్, సిద్ధలింగప్ప, రవి కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్వర్టును మరమ్మతులు చేయాలి



మరికల్: గతపదేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకుని కల్వర్టులను మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. కన్మనూర్, గాజులయ్య తాండల మధ్యన కెనాల్‌పై నిర్మించిన కల్వర్టు వాహనాల రాకపోకలకు ధంసమైంది. ఇక్కడ వాహనాలు అదుపు తప్పితే కెనాల్‌లోకి పడిపోవాల్సిందే. ఈ కల్వర్టుకు ఓ పక్క ధ్వంసమైన రక్షణ గోడను తిరిగి మరమ్మతులు చేయాలని పలుమార్లు ఇరువురు గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్రీడా కోర్టుల ధ్వంసం



మరికల్: మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన బాలుర ఉన్నత పాఠశాల కూల్చివేత పనుల్లో భాగంగా క్రీడా కోర్టులను ధ్వంసం చేశారు. పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్ ప్రాక్టిస్‌తోపాటు అప్పడప్పుడు మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే పోటీలకు గాను క్రీడాకారులు రూ.70వేలతో రెండు కోర్టులను సిద్ధం చేశారు. అయితే పాఠశాల గదుల కూల్చివేత తర్వాత పక్కనే ఉన్నా కబడ్డీ, వాలీబాల్ కోర్టులను అధికారులు పోక్లెయిన్‌తో ధ్వంసం చేయించడంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎలా ధ్వంసం చేశారో అలాగే రెండు క్రీడా కోర్టులను సిద్ధంచేసి ఇవ్వాలని మండల క్రీడాకారులు కోరుతున్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శివకుమార్ ఇటీవల సొంతంగా యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. మొదటి ప్రయత్నంలోనే అనూహ్యంగా క్లిక్ కావడంతో తొలి సంపాదన మొత్తాన్ని బీదవారికి సేవ చేయాలనుకున్నాడు. దీంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు భోజనం ప్యాకెట్లు, తాగునీరు, అరటిపండ్లను అందించారు. కార్యక్రమంలో ఆనంద్, నిఖిల్, దీపక్, ప్రవీణ్, గిరిధర్, నవీన్, సాధిక్, రాకేష్, సిద్ధు, అఖిల్, శివ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

మక్తల్: మండలంలోని గడ్డంపల్లిలో సవారమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా మంగళవారం గ్రామంలో కబడ్డీ పోటీలను మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కబడ్డీ పోటీలో అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గడ్డంపల్లి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూప్ వరకే పరిమితం



వీబీఓలకు కిట్‌ను అందిస్తున్న అధికారులు (ఫైల్)

- ఆర్టీసీలో ఆరు నెలలుగా మూలనపడ్డ పథకం
- డిపోకే పరిమితమైన విలేజ్ బస్ ఆఫీసర్లు

నారాయణపేట రూరల్: ప్రజలకు ఆర్టీసీని మరింత చేరువ చేయాలనే సదుద్దేశంతో ఎండీ సజ్జనార్ గత ఏడాది ప్రతిష్టాత్మకంగా విలేజ్ బస్ ఆఫీసర్ల పథకాన్ని అమలు చేశారు. మొదట్లో కొంత మేర ముందడుగు పడినా అధికారుల నిర్లక్ష్యంతో అది పూర్తిగా మరుగున పడింది. దీనికితోడు గత ఏడాది ఎంపిక చేసిన వారిలో కొందరు ఏడీసీలుగా పదోన్నతి పొందితే మరి కొందరు డిపోలో ఓడీ ప్రతిపాదికన వివిధ విభాగాల్లో పనిచేస్తూ స్థిరపడ్డారు. మిగిలిన వారు సైతం తమ విధులు చూసుకుంటున్నారు. ప్రస్తుతం కేవలం వాట్సాప్‌లో ఏర్పాటు చేసిన విలేజ్ ఆఫీసర్ల గ్రూపునకు మాత్రమే పరిమితమైందని చెప్పాలి.

17మంది వీబీఓల నియామకం

జిల్లాలో 208జీపీలకుగాను మొదటి విడతగా మేజర్, పెద్ద గ్రామ పంచాయతీలలో 54ఎంపిక చేశారు. దీనికిగాను నాడు అత్యుత్తమ ఈపీకే తీసుకొచ్చిన 17మంది కండక్టర్లను ఎంపిక చేసి విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమించారు. ఒక్కొక్కరికి 3 నుంచి 5గ్రామాలను అప్పగించారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారు నిర్వహించాల్సిన విధులను తెలియజేశారు. కొంత డబ్బును ఖర్చుచేసి మరి ప్రత్యేకంగా ముద్రించిన టీషర్టులు, ఐడీకార్డు, బ్యాగులు, ప్రజలకు చెప్పాల్సిన విషయాలకు సంబంధించి పుస్తకాలు అందజేశారు. వీరికి అప్పగించిన గ్రామ పంచాయతీల నోటీస్‌బోర్డులో వీబీఓల పేరు, చిరునామా, ఫోన్‌నంబర్లను పొందుపర్చాలని సూచించారు.

మరుగున పడిన వైనం..

ప్రతి 15రోజులకు ఒకసారి వారికి కేటాయించిన గ్రామాల్లో వీబీఓలు పర్యటించి ప్రజాప్రతినిధులు, జీపీ అధికారులతో కలిసి ప్రజలను సమావేశ పర్చాలి. గ్రామ రవాణా సౌకర్యాలపై సమస్యలను తెలుసుకుని వారి ఫిర్యాదులు రిజిస్టర్‌లో నమోదుచేసి డీఎంకు తెలియజేయాలి. బస్సుల రాకపోకలు, సమయసారిణి గ్రామాల్లో ప్రదర్శించాలి. కొత్త రూట్లు, అదనపు సర్వీసులపై అధ్యాయనం చేసి సలహాలు ఇవ్వాలి. ఇక కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో మహిళల ఉచిత రవాణాతో వీబీఓ స్కీమ్ పూర్తిగా అటకెక్కింది. బస్సుల సంఖ్య సరిపోవడంలేదనే సాకుతో అధికారులు వీరిపై దృష్టి సారించడంలేదని తెలుస్తోంది.

మహాలక్ష్మి పథకంతో విరామం



గత ఏడాది డిసెంబర్‌లో మహాలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత బస్సులో మహిళల ప్రయాణం పెరిగింది. రోజువారి ఓఆర్ గణనీయంగా అభివృద్ధి చెందింది. డిపోల్ ఉన్న సర్వీసులను రెగ్యూలర్ రూట్లలో తిప్పడానికే సరిపోవడం లేదు. దీంతో వీబీఓల సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కొత్త బస్సులు వచ్చిన తర్వాత తిరిగి పున:ప్రారంభిస్తాం.

– వీ.లక్ష్మిసుధ, డిపోమేనేజర్, నారాయణపేట

వీబీఓలు చేయాల్సిన విధులు..

గ్రామ బస్ అధికారులు ఆర్టీసీ ద్వారా అందించే సేవలను ప్రజలకు వివరించి సురక్షిత ప్రయాణానికి బస్సులో ప్రయాణించాలని సూచించాలి. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత, రాయితీ పాసులు, దివ్యాంగులకు 50శాతం టికెట్ ధరతో ప్రయాణం, డయాలసిస్ రోగులకు ఉచిత, జర్నలిస్టులకు ఉచిత, 3వంతు రుసుంతో ప్రయాణ సౌకర్యాలపై వివరించాలి. ప్రజా రవాణా సంస్థను కాపాడుకోవాల్సిన అవసరంపై వివరించాలి. దీంతోపాటు ఆయా గ్రామాల్లో అందించే వినతులు, ఫిర్యాదులు, సలహాలను స్వీకరించి ఆర్టీసీ అధికారులకు చేరవేయాలి. పుణ్యక్షేత్రాల సందర్శన, శుభకార్యాలకు అవసరమైన అద్దె బస్సుల వివరాలు, ఆర్డర్ బుక్ చేయడం కోసం డిపోకు వెళ్లకుండా వీరే దగ్గరుండి ఆయా గ్రామాల్లోనే ఉండి వివరాలు సేకరించి బుక్ చేయించాలి. ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థి సంఘాలు, కళ్యాణ మండప నిర్వాహకులకు వారి సెల్ నంబర్లను ఇచ్చి బస్సులను అద్దెకు బుక్ చేయించేందుకు సహకారం అందించాలని కోరాలి.

నిడ్జింతలో చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మద్దూర్: నూతన మండలం కొత్తపల్లి పరిధిలోని నిడ్జింతలో జెక్కం చెరువును మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువును కొందరు రైతులు కబ్జా చేశారని హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించారు. కొందరు రైతులు చెరువును ఆక్రమించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. చెరువు విస్తీర్ణం పెద్దదిగా ఉండటంతో మరోమారు సమగ్ర సర్వేచేసి హద్దులు నిర్దేశిస్తామని తహసీల్దార్ అనిల్ తెలిపారు. ఎవరూ ప్రభుత్వ భూముల్ని ఆక్రమించిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మదు, సర్వేయర్ అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కోస్గి: 26 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న బాల్యమిత్రులు మరోమారు కలుసుకోవాలని నిర్ణయించి మంగళవారం స్థానిక ఏబీకే ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు తమ తమ సాధకబాధకాలను చర్చించుకొని మురిసిపోయారు. ఈ మేరకు.. తాము చదివిన పాఠశాలకు రూ.50 వేల విలువైన బెంచీలు పాఠశాలకు అందజేశారు. సన్మానం పొందిన గురువులు సైతం ఇది జీవితంలో మరచిపోని ఘట్టంగా తమ పూర్వ విద్యార్థులను అభినందించారు.



సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ

మాగనూర్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పర్మన్‌దొడ్డిలో కొనసాగుతున్న ఉపాధి పనులను తనిఖీచేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కూలీలకు పనికల్పించే విధంగా ప్రదేశంలో రెండుసార్లు ఫొటోలు తీసినప్పుడే వారికి డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డ్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయాలని సూచించారు. ఎండలు ఉండటంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తిచేసుకుని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తప్పకుండా తాగునీరు తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయనతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్, మెటీ తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరసావర్కర్ జయంతి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక దామోదర సావర్కార్ 142వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, తపస్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, భావ సమైక్యవేదిక తదితర సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.. దేశంకోసం త్యాగం చేసిన మహానుబావుడని, స్వాతంత్ర్యం కోసం జైలు శిక్ష అనుభవించాడని చెప్పారు. పార్లమెంట్‌లో ఆయన విగ్రహం ప్రతిష్టించాలని కోరారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, రఘువీర్‌యాదవ్, వెంకటయ్య, క్యాతన్‌రఘునాథ్, మిలగిరికాంబ్లే, పస్పుల రవి, ప్రవీణ్, ప్రభాకర్, శ్రవణ్, వెంకటేష్, విజయ్, శేర్‌కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సవారమ్మ దేవత ఉత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పట్టణంలోని భక్తులు మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యాలతో పాటు కోళ్లు, టెంకాయలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది వేసవి చివరిలో సవరమ్మ దేవత జాతరను నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెంట టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, శ్రీలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరగిద్ద: మండలంలోని లోకూర్తి సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని లోకూర్తి, పిడెంపల్లి, ఆశన్‌పల్లి కందెన్‌పల్లి, చాకల్‌వానిపల్లి, ఎల్సన్‌పల్లి, గట్‌రెడ్డిపల్లి పీడర్లకు విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం ఉంటున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు రైతులు గృహవినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ

ఊట్కూరు: మండలంలో నాలుగు రోజులుగా ఉపాధిహామీ పథకంలో సామాజిక తనిఖీ కొనసాగుతుంది. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ తెలిపారు. 29న సమస్తాపూర్‌లో, 30న కొల్లూరు, ముగ్దంపూర్, తిమ్మారెడ్డిపల్లితాండ, ఊట్కూరు, వల్లంపల్లి, కొత్తపల్లి, బిజ్వార్, ఎర్గాట్‌పల్లి, మల్లెపల్లి, ఎడివెల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. 31న మండల పరిషత్ భవనంలో మండల స్థాయి సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ముగిసిన నెట్‌బాల్ క్యాంప్



ధన్వాడ: సమ్మర్‌లో సెలవుల్లో నిర్వహించిన నెట్‌బాల్ సమ్మర్ క్యాంప్ ముగిసిందని కోచ్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. నెలరోజులపాటు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించామని, ఇందులో విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొని నెట్‌బాల్ కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. రేపు హైదరాబాద్‌లో 7వ నెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం కానుందని, ఇందులో జిల్లా నుంచి ఎంపికైనా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మంగళవారం సీనియర్ క్రీడాకారులతో పరిచయ వేదిక నిర్వహించి వారితో మెలకువలను క్రీడాకారులకు తెలియజేశారు.

వేతనాలు పెంచాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులు తమకు వేతనాలు పెంచాలని కోరుతూ ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు తమకు 12 నెలలకు కన్‌సాల్‌డేటెడ్ వేతనాలు రూ.50వేలు ఇవ్వాలని కోరారు. విషయంపై ఆయన సానుకూలంగా స్పంచిందిచినట్లు రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



కోస్గిలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/నర్వ/ కోస్గి: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. అనంతరం వైదిక పాఠశాలలో ఎస్ఎస్ఆర్ సమ్మర్ కో చింగ్ సెంటర్‌లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే కోస్గిలో స్థానిక శివాజీ చౌరస్తాలో టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా నర్వలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఆయా కార్యక్రమంలో యాబన్నచౌద్రి, భీమన్న, నారాయణ, పెంటప్ప, శేఖర్, సామల వెంకట్ ప్రసాద్, కుమ్మరి అంజిలయ్య, అచ్యుతారెడ్డి, అమృతారెడ్డి, సాయిరెడ్డి, డా. వెంకటేశ్వర్‌రావు,కుర్మారెడ్డి, వెంకట్రామా రెడ్డి, శ్రీనివాస్‌రావు, రఫీ, రాములుగౌడ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న శివశంకర్

నారాయణపేట రూరల్: పోలీసు వాహనాలను నడిపించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంటీఓ ఆర్ఎస్ఐ శివశంకర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. పెట్రోలింగ్ విధులు చేపట్టే పోలీసులు నిరంతరం కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండాలని, వాహనానికి జీపీఎస్ సిస్టం కనెక్ట్ చేయబడి ఉందని చెప్పారు. ముందస్తు నేరాల కట్టడికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. కంప్యూటర్ ఆధారంగా వాహన రూట్‌లను చెక్ చేయడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. వాహనాన్ని ప్రతిరోజు శుభ్రపర్చాలని, కండీషనల్‌లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన మెకానిజం తెలుసుకుని ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సిబ్బంది, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ నరేందర్

కోస్గి: రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ నరేందర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండలంలోని బోగారంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులు విధిగా వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రసీదు తీసుకోవాలని, ప్యాకింగ్ లేకుండా లూజ్‌గా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీటీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్‌టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతోపాటు మగపిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేయొద్దని, పురిట్లో చిన్నారులను చంపడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కౌరంపల్లి మైసమ్మ జాతర



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం శివారులోని కౌరంపల్లి మైసమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం భక్తిశ్రద్ధలతో జల్దిబిందె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి పూజలు నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరీ మాత ఆలయం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు, నిర్వహణ కమిటీ సభ్యులు, సింగారం గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ఖరీఫ్ ప్రారంభం నాటికే రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భగవంతు, యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌ను కలిసి ఏఐకేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు. పచ్చిరొట్ట, జీనుగ విత్తనాలకు భారీగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో సరిపడా పంపిణీ చేయాలన్నారు. వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణ, బాలకృష్ణ, నారాయణ, తాయప్ప, రాజు, సుభాష్, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లీకేజీలు పట్టవా ?



తాగునీటి పైప్ లీకేజీ

దామరగిద్ద: మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ చేరే నల్లాల ప్రధాన పైప్‌లైన్‌లు లీకేజీలు కావడంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. మండలంలోని మద్దెల్‌బీడ్‌లోని ఎస్సీకాలనీలో సీసీ రోడ్డు పక్కన తాగునీటి పైప్‌లైన్ లీకేజీలో తాగునీటి కలుషితమై మురుగునీరు వస్తుందని స్థానిక కాలనీ ప్రజలు అంటున్నారు. వర్షాకాలం ప్రారంభం కానుండటంతో మరమ్మతులు చేపట్టి కలుషిత నీటి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారులను కోరుతున్నారు.